క్లుప్తంగా

అర్హులకు డబుల్ ఇళ్లు ఇవ్వాలి


డబుల్ బెడ్రూంలను పరిశీలిస్తున్న నాయకులు

సంగారెడ్డి టౌన్ : నిజమైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాయిలు అన్నారు. ఆదివారం సంగారెడ్డి మండలంలోని దాసుగడ్డ గ్రామపంచాయతీలోని డబుల్ బెడ్రూంలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ ఏరియా కార్యదర్శి యాదగిరి, మండల కార్యదర్శి శ్రీనివాస్, కమిటీ సభ్యులు శేఖర్, నర్సింలు, దత్తు పాల్గొన్నారు.

భగవంతుడిని పూజించాలి


సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న సంగన్న

మునిపల్లి(అందోల్): ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిత్యం భగవంతుడిని పూజించాలని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తక్కడపల్లిలో మాల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. మాజీ ఉపసర్పంచ్ సంగన్న, గ్రామస్తులు ఎఎంసీ చైర్మన్ సుధాకర్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు.

ఘనంగా సంత్ చోఖామేళా ఉత్సవాలు


దిండి శోభాయాత్రలో మహిళలు

నారాయణఖేడ్: పట్టణంలో శ్రీసంత్ చోఖామేళా మహోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన రహదారులగుండా మహిళలు కలశాలతో వారీకార్ భక్తులు భజన, కీర్తనలతో దిండియాత్ర నిర్వహించారు. మహారాష్ట్రలోని కరండి పండరీపూర్‌కు చెందిన అంబాదాస్ మహారాజ్ ఆధ్వర్యంలో మరాఠీలో శ్రీసంత్ చోఖామేళా సమాధి ఉత్సవ కీర్తన నిర్వహించగా ఉజలంపాడ్‌కు చెందిన పండరీనాథ్ మహరాజ్ తెలుగులో అనువదించారు. అనంతరం మహాప్రసాద వితరణ చేపట్టారు.

ఫరీద్‌కు సన్మానం


ఫరీద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలంటే అల్లాను ప్రార్థించాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పేర్కొన్నారు. హజ్‌యాత్రకు వెళ్తున్న రైల్వే బోర్డు మెంబర్ షేక్ ఫరీద్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవిత్రమైన హజ్ యాత్రకు వెళ్లడం వల్ల అంతా మంచే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మొహియొద్దీన్, ముర్తుజా తదితరులు పాల్గొన్నారు.

సీసీ నిర్మాణంలో నాణ్యతా లోపం


నిర్మాణ దశలోనే ధ్వంసమైన రోడ్డు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం వావిలాలలోని హనుమాన్ ఆలయం నుంచి పీర్ల చెరువు వరకు నిర్మిస్తున్న సీసీరోడ్డు గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద ధ్వంసం అయిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రోడ్డు స్వల్ప వ్యవధిలోనే పగుళ్లు ఏర్పడి ధ్వంసం కావడం ఏంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు. నాణ్యతతో కూడిన రోడ్డు పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

మునిపల్లి(అందోల్): ఎల్లమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం మండలంలోని బోడపల్లి గ్రామశివారులో అదే గ్రామానికి చెందిన బసంత్‌గౌడ్ కుటుంబ సభ్యులు అమ్మవారికి కల్యాణం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.


కరెంట్ స్తంభాలపైన పక్షులు ఏర్పాటు చేసుకున్న గూళ్లు


కరెంట్ షాక్‌తో చనిపోయిన పక్షి

• చెట్లు లేక.. గూడు దొరకక

రాను రాను అడవుల సంఖ్య తగ్గిపోవటం, పల్లెల్లో సైతం పట్టణీకరణ పేరుతో ఇష్టమొచ్చినట్లు చెట్లు నరికివేయటంతో పక్షులకు మనుగడ కష్టమమైంది. అవి నివసించదానికి గూడు లేకుండా పోతుంది. దీంతో కరెంటు స్తంభాలపై గూడు పెట్టుకుంటున్నాయి. కొన్నిసార్లు కరెంట్ షాక్‌తో పక్షులు చనిపోతున్నాయి. పెద్దగాలి వాన వచ్చినా వాటి గూడు చెదిరిపోతుంది.

– సాక్షి , స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

ఎరువుల మోతాదు మించొద్దు


పత్తి పంట (ఫైల్)

పత్తిలో అధిక వినియోగంతో భూసారానికి ముప్పు

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడిపై దృష్టి సారించాలి
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయికోడ్, (అందోల్): వానాకాలం సీజన్‌లో భాగంగా జిల్లాలోని రైతులు అధికంగా పత్తి పంటను సాగు చేస్తున్నారు. పత్తిసాగులో ఎడాపెడా ఎరువులు వినిగించడంతో రైతులకు పెట్టుబడులు పెరుగుతున్నాయి. అతివృష్టి , అనావృష్టి కారణంగా గత నాలుగేళ్లుగా ఆశించిన దిగుబడులు రాక రైతులు నష్టపోతున్నారు. ఈ క్రమంలో అవసరం మేరకే ఎరువులు వినియోగించి పెట్టుబడులు తగ్గించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. సాగు చేసే పొలం మట్టి పరీక్షల ఆధారంగా అవసరమైన ఎరువులు తగిన మోతాదులో వినియోగిస్తే రైతులకు మేలు చేకూరుతుంది. మోతాదుకు మించి ఎరువులు వినియోగించడం వల్ల పత్తి పంటలకు ఎలాంటి లాభం చేకూరకపోగా భూసా రం దెబ్బతిని దీర్ఘకాలంలో సాగుకు పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది కూడా అధికంగా జిల్లా రైతులు 3,87,539 ఎకరాల్లో పత్తిసాగు చేయనున్నారు.

భూసారాన్ని కాపాడుకోవాలి..



రైతులు పంటల దిగుబడిపైనే కాకుండా తమ పొలాల్లో భూసారం కాపాడుకోవడంపై దృష్టి సారించాలి. అందుకోసం మోతాదుకు మించి ఎరువులు వినియోగించొద్దు. ఎక్కువగా వాడటం వల్ల భూసారం దెబ్బతిని సాగుకు చేను పనికిరాకుండా పోయే అవకాశాలు ఉన్నాయి. ఎరువులు, పురుగు మందుల వినియోగంలో రైతులు అధికారుల సూచనలు పాటించి ప్రయోజనం పొందాలి.

– సత్యనారాయణ, ఏడీఏ రాయికోడ్

ఎకరాకు వినియోగించాల్సిన ఎరువులు

ఎకరా పత్తి సాగుకు పొలం దున్నే సమయంలో 50 కిలోల డీఏపీని చల్లుకోవాలి. పత్తి విత్తనం వేసిన 20, 40, 60 రోజులకు మూడు సార్లు మొత్తం 90 కిలోల యూరియాను వర్షం పడిన సమయంలో వేయాలి. 25 కిలోల పొటాష్ ఎరువును విత్తనం నాటిన 60 రోజులకు యూరియాతో కలిపి వేసుకోవాలి. రైతులు సాధారణంగా ఎకరా పత్తి పంట సాగు పూర్తయ్యే లోపు అవసరం కంటే రెండింతల ఎరువులు వినియోగిస్తున్నారని అధికారులు చెబుతున్నారు.


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008–2009 పదవ తరగతి చదువుకున్న అప్పటి విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 16 ఏళ్ల తరువాత కలుసుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషంగా గడిపారు. ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లాలయ్య, తుకారం, పద్మ, నగేష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

క్షతగాత్రులకు సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి పరామర్శ

జహీరాబాద్: పట్టణంలోని ఈద్గా మైదానంలో శనివారం జరిగిన ప్రమాదంలో ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. పార్లమెంట్ ఆమోదం పొందిన వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన కమాన్ ఒక్కసారిగా కూలిపోయింది. కమాన్ కింద ఉన్న 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గుర్తించిన కొందరు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. తీవ్ర గాయాలైన వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. స్వల్పగాయాలైన వారిని స్థానిక ఆసుపత్రులకు తరలించారు. క్షతగాత్రులను సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఉజ్వల్ రెడ్డి పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. వారి వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, అక్తర్ , హర్షద్ పటేల్ తదితరులు ఉన్నారు.


క్షతగాత్రులను పరామర్శిస్తున్న గిరిధర్‌రెడ్డి

27న నిధి ఆప్కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా ప్రతి నెల నిధి ఆప్కే నిఖత్ 2.0ను నిర్వహిస్తోంది. ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ కమిషనర్ విశాల అగర్వాల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కేంద్రాల్లో నాలుగు శిబిరాలను ఉ. 9:30 గంటల నుంచి సా.5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. పటాన్‌చెరు మండలం రుద్రారంలోని ఎంఎస్‌ఎన్ ల్యాబ్ రేటీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో, సంగారెడ్డి.. పోతిరెడ్డిపల్లి లిమిటెడ్ వరుణ్ బెవరైజస్, హైదరాబాద్ శేరిలింగంపల్లి కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్, జిన్నారం మండలం గడ్డపోతారం న్యూ ల్యాండ్ ఫార్మ యూనిట్- 3లో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యనిధి సమస్యలు ఉన్నవారు పైన పేర్కొన్న మూడు కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

కార్మికుల సంక్షేమం బీఎంఎస్‌కే సాధ్యం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): కార్మికుల సంక్షేమం, అభివృద్ధి బీఎంఎస్ (భారతీయ మజ్దూర్ సంఘ్)తోనే సాధ్యమని ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మల్లేశం అన్నారు. ఆదివారం మండలంలోని ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్ సమావేశానికి హాజరై మాట్లాడారు. కార్మికులకు చట్టబద్ధమైన ఉద్యోగ భద్రత, స్వేచ్ఛ కల్పిస్తానని పేర్కొన్నారు. ఈ నెల 28న జరిగే యూనియన్ ఎన్నికల్లో కాగడా గుర్తుకు ఓటేసి బీఎంఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, మాణిక్ రావు, సంఘం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన


నగర సంకీర్తనలో మాట్లాడుతున్న విభీషణ్ ప్రభు

జహీరాబాద్: మనిషి తన పని తాను చేసుకుంటూనే శ్రీకృష్ణ పరమాత్ముడి భక్తి భావనకు చేరువ కావాలని కందిలోని హరేకృష్ణ టెంపుల్ ప్రతినిధి విభీషణ్ ప్రభు అన్నారు. ఆదివారం పట్టణంలోని బాగారెడ్డి స్టేడియం నుంచి బ్లాక్‌రోడ్డు మీదుగా 156వ నగర సంకీర్తన శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక భావనలో కల్గి ఉండడం వల్ల మానవుడు దుష్టకార్యాలకు దూరంగా ఉంటాడని తెలిపారు. లోక హితానికి, సమాజ శ్రేయస్సుకు భక్తి మార్గమే ప్రధానమైనదన్నారు. యుద్ధంలో విజయం సాధించడం ద్వారా రాజ్య ప్రాప్తి, మరణించడం ద్వారా స్వర్గ ప్రాప్తి కలుగుతుందన్నారు. యుద్ధంలో వెనుకడుగు వేసిన అర్జునుడిని కృష్ణ పరమాత్ముడు గీతా బోధన చేస్తూ చైతన్యపరిచినట్లు పేర్కొన్నారు. జయాపజయాలు పక్కనపెట్టి కర్తవ్య నిర్వహణలో పాలు పంచుకోవాలని హితవు పలికారు. నగర సంకీర్తన సందర్భంగా నృత్యాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బాధిత కుటుంబాలకు పరామర్శ

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం మంగంపేట గ్రామ మాజీ ఉపసర్పంచ్ తల్లి లక్ష్మీబాయి, పెద్దమ్మగూడెం గ్రామానికి చెందిన సీత కొముర‌య్య మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఇరు కుటుంబాలను పరామర్శించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకటేశంగౌడ్, నరసింహారెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

◆ చంటి క్రాంతికిరణ్‌కు సన్మానం

మునిపల్లి(అందోల్): జూన్ 2న అమెరికాలోని న్యూజెర్సీలో జరిగే బీఆర్‌ఎస్ పార్టీ 25వ వార్షికోత్సవం సిల్వర్ జూబ్లీ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరవుతున్న మాజీ ఎమ్మెల్యే చంటిక్రాంతికిరణ్‌కు ఆ పార్టీ నేత శశికుమార్ సన్మానించారు. ఆదివారం మునిపల్లి మండలం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు శంషాబాద్ విమానాశ్రయంలో క్రాంతి కిరణ్‌కు సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.

◆ ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని సుక్కల్‌తీర్థ్ గ్రామానికి చెందిన తుకారాం తండాలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీభవాని మాతా విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభించినట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా భవానిమాతా, సేవాలాల్ మహరాజ్ విగ్రహాల ప్రతిష్ఠ , శిఖర ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం దీపం ప్రజ్వలన, గణపతి పూజ, మంటపారాధన, పుణ్యవచనం, నవగ్రహ వాస్తు, ముఖ్యదేవత ఆహ్వానం, అన్నప్రసాదం నిర్వహించారు. దేవిప్రతిష్ఠ ఉత్సవాలు 29 వరకు నిర్వహించనున్నట్లు స్థానిక గిరిజన భక్తులు తెలిపారు.



◆ బీఆర్‌ఎస్ నాయకులకు సన్మానం

మునిపల్లి(అందోల్): తక్కడపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన మాలపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరైన బీఆర్‌ఎస్ నాయకులను ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. బీఆర్‌ఎస్ యువత విభాగం రాష్ట్ర నాయకుడు సాయికుమార్‌ను సన్మానించారు. అంతకుముందు మాలపోచమ్మ అమ్మవారికి సాయికుమార్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

◆ మన్ కీ బాత్ వీక్షించిన నాయకులు

నారాయణఖేడ్: మున్సిపల్ బీజేపీ నాయకులు ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. సంగారెడ్డి జిల్లాలో వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీబాత్‌లో మాట్లాడటం జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించడానికి నిదర్శనమని పట్టణ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, బీజేవైఎం ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు పట్నం మాణిక్, పార్టీ నాయకులు సాయేందర్, లోకేశ్, ఏక్‌నాథ్, సాయి తెలిపారు.




క్రీడాభారతి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ

రామచంద్రాపురం (పటాన్‌చెరు): ఆపరేషన్ సింధూర్ విజయానికి శ్రమించిన భారత సైనికులకు మద్దతుగా ఆదివారం క్రీడాభారతి తెలంగాణ అధ్యక్షుడు సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో నిర్వహించిన ర్యాలీలో 250 మంది క్రీడాభారతి సభ్యులు పాల్గొని జాతీయ జెండాలతో భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎయిర్ ఫోర్స్ అధికారులు శ్రీనివాస రఘునందన్, శ్రీనివాస్, క్రీడాభారతి సభ్యులు పాల్గొన్నారు.

బొల్లారంలో..

జిన్నారం (పటాన్‌చెరు) : పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన భారత త్రివిధ దళాలకు బొల్లారంలో జేజేలు పలికారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో సైనికులకు మద్దతుగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చంద్రారెడ్డి, సీఐ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మున్సిపల్ వాసులు త్రివర్ణ పతాకాలతో భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు. పాకిస్తాన్ దుశ్చర్యలకు భారత్ సమర్థవంతంగా తిప్పికొట్టిందని పేర్కొన్నారు. అఖిలపక్ష నాయకులు ఆనంద్‌కృష్ణారెడ్డి, గుడ్ల మహేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, స్థానికులు పాల్గొన్నారు.


జిన్నారం: ర్యాలీలో పాల్గొన్న నాయకులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. ఆదివారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి కల్హేర్ మండలం బీబీపేట్‌కు చెందిన బేగరి శోభకు రూ.25వేలు, అంజిరెడ్డికి రూ.20వేల చెక్కులను అందజేశారు. అలాగే, జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్ సిఫార్సు మేరకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి కంగ్టి మండలం సిద్ధంగిర్గాకు చెందిన సంజీవరెడ్డికి రూ.33 వేలు, సాయిలుకు రూ.21,500, సాత్విక్‌కుమార్‌కు రూ.37 వేలు, నర్సుగొండకు రూ.15,500 మంజూరయ్యాయి. సంబంధించిన చెక్కులను ఖేడ్‌లో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్, జిల్లా నాయకులు సాగర్ షెట్కార్ లబ్ధిదారులకు అందజేశారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దగోపులారంలో...

మునిపల్లి(అందోల్): మంత్రి దామోదర సహకారంతో బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించామని మాజీ ఎంపీటీసీ పాండు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పెద్దగోపులారంలో చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

నిరుపేద యువతికి ఆర్థిక సాయం


వివాహ పత్రికను ఇస్తున్న కుటుంబ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గ పరిధిలోని ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటి నిలుస్తూ.. ఎప్పటికప్పుడు తన దాతృత్వాన్ని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చాటుకుంటూ ప్రజల గుండెల్లో నిలుస్తున్నారు. తాజాగా.. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరుకు చెందిన వాటర్ వర్కర్ ఉద్యోగి మాణిక్యం ఇటీవల మృతి చెందారు. ఆయన కుమార్తె వివాహం నిశ్చయం కావడంతో ఆదివారం వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు పెళ్లి పత్రికను అందజేశారు. మాణిక్యంతో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్న ఎమ్మెల్యే యువతి వివాహానికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించి గొప్ప మనసు చాటుకున్నారు. భవిష్యత్తులోనూ వారి కుటుంబానికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొల్లూరు మాజీ ఎంపీటీసీ నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా రాంతీర్థ్–వడ్డి రోడ్డు

న్యాల్‌కల్ (జహీరాబాద్): మండలం పరిధి రాంతీర్థ్–వడ్డి రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డుపై బీటీ లేచిపోయి గుంతలమయంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మరమ్మతులకు మంజూరైన నిధులతో కాంట్రాక్టర్ అక్కడక్కడ ప్యాచ్ వర్క్ చేసి చేతులు దులుపుకొన్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని రోడ్డును బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


గుంతలమయంగా రోడ్డు

రైతుల భూములకు మద్దతు ధర ఇవ్వాలి

బీఆర్‌ఎస్ నాయకుడు గోవర్ధన్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 109లో భూములకు మార్కెట్ వ్యాల్యూ ప్రకారం మద్దతు ధర ఇవ్వాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇండస్ట్రియల్ ఐటీ పార్క్ ఏర్పాటుకు సర్వే నంబర్ 109లో 157 ఎకరాల భూములను రైతుల నుంచి తీసుకునేందుకు కసరత్తు పూర్తి చేసిందన్నారు. ఈ క్రమంలో భూములు ఇస్తున్న రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. లేనిపక్షంలో రైతులతో కలిసి పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. మండల అవసరాలకు 50 ఎకరాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400